# ఎఱ్ఱన జీవితం, కవితా రీతులు

తెలుగుజాతికి మహేతిహాసమైన ఆంధ్ర మహా భారతాన్ని పూర్తిచేసి కవిత్రయంలో స్థానం సంపాదించిన మహాకవి ఎఱ్ఱన . ఎఱ్ఱన 14వ శతాబ్దానికి చెందిన కవి. వీరు రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. ఎఱ్ఱన తండ్రి మారన గొప్ప కవి. తాత ఎరపోతసూరి.

ఎఱ్ఱన రచనలు:

1.అరణ్యపర్వ శేషం
2.నృసింహ పురాణం
3.హరివంశం
4.రామాయణం .మొదలైన రచనలు చేశారు .

ఎఱ్ఱన హరివంశాన్ని రచించి ప్రోలయ వేమారెడ్డికి అంకితమిచ్చాడు. ఎఱ్ఱన వర్ణనాత్మక శైలిలో రచనలు చేసి ప్రబంధ పరమేశ్వరుడు గా కీర్తి పొందాడు.

ఆంధ్ర మహాభారతం లో నన్నయ ఆది ,సభా పర్వాలను అరణ్యపర్వంలో చతుర్థాశ్వాసం లో 142వ పద్యం వరకు రాయగా, ఎర్రన 143 పద్యం నుండి ప్రారంభించి అరణ్య పర్వాన్ని పూర్తి చేశాడు . ఎఱ్ఱన రచనలో కూడా ప్రసన్న

కథా కథనం, అక్షర రమ్యత, సూక్తి నిధిత్వం ఉన్నాయి నన్నయ శైలికి ఎఱ్ఱన శైలికి పోలికలు కనిపిస్తాయి. ఉదాహరణ: ధర్మ వ్యాధోపాఖ్యానం, సావిత్రి చరిత్ర, కర్ణుని జన్మ కథ మొదలైన ఘట్టాలలో ఎఱ్ఱన కథాకథన పద్ధతి ని ప్రదర్శించారు.

ఎఱ్ఱన రచించిన అరణ్యపర్వ శేషంలో క్రింది లక్షణాలు కనిపిస్తాయి. అవి:

1. ప్రపంచీకరణ,
2. క్లుప్తీకరణ,
3. అనాంధ్రీరణ

<u>ప్రపంచీకరణ</u>: మూలంలో కుంతీదేవి కర్ణుని అశ్వనది లో విడిచి పెట్టేటప్పుడు  పుత్రశోకంతో బాధ పడినట్లుగా ఉండగా ఎర్రన్న కుంతి శోకాన్ని ప్రపంచీకరించి ఏడు పద్యాలలో కరుణ రసాత్మకంగా కుంతిదేవి మాతృహృదయ వేదనను వర్ణించారు

<u>క్లుప్తీకరణ</u>: మార్కండేయ ముని ధర్మరాజు చెప్పిన కలియుగ ధర్మాలు మూలంలో 100 కు పైగా శ్లోకాలు ఉండగా ఎర్రన్న వాటిని 25 పద్య గద్యాలలో సంగ్రహించి ఆంధ్రీకరించారు.

అనాంధ్రీకరణ: మూలంలో ఇంద్రద్యుమ్న ఉపాఖ్యానానికి,దుందుమార ఉపాఖ్యానానికి మధ్యలో అన్నదాన ఫలం గురించి ఉన్న అధ్యాయాన్ని ఎఱ్ఱన ఆంధ్రీకరించలేదు.

ఎఱ్ఱన కవితా రీతులు:ఎర్రన్న కావ్యాలలో ప్రధానంగా
1.ప్రబంధోచిత వర్ణనలు
2.పాత్రచిత్రణ
3.సూక్తి వైచిత్రి ముఖ్యమైనవి.

వర్ణనా నైపుణ్యం:
ఎర్రన రచనలన్నిటిలో వర్ణనా నైపుణ్యం కనిపిస్తుంది. శ్రీ కృష్ణుని బాల్య క్రీడలు, అల్లరి చేష్టల వర్ణన ఎర్రన ప్రబంధ పరమేశ్వరత్వానికి చక్కని ఉదాహరణ.

పాత్ర చిత్రణ:
ఎఱ్ఱన పాత్ర చిత్రణలో మిక్కిలి నైపుణ్యం కలవాడు. నన్నయ్య చిత్రించిన కుంతీ కంటే గడసరిగా ఎర్రన్న కుంతిని చిత్రించాడు. హరివంశంలో బాలకృష్ణుని పాత్రను అత్యంత

మధురంగా చిత్రించారు. శ్రీకృష్ణుని అల్లరి చేష్టలను, గోపికల పాట్లను ఎంతో రసరమ్యంగా, అద్భుతంగా చిత్రించారు.

సూక్తులు -లోకోక్తులు:

ఎర్రన్న భారత అరణ్యపర్వ శేషంలో ఎన్నో ఆణిముత్యాల్లాంటి సూక్తులు లోకోక్తులు ప్రయోగించి తన సూక్తి వైచిత్రి చాటుకున్నాడు.

ఉదా: సజ్జన దర్శనంబెప్పుడు వృధా కాదు
సకల మార్గంబునందు ధర్మ మార్గము ప్రధానంబు.

ఆంధ్రీకరణ విధానం:

ఎర్రన  భారతాన్ని  నన్నయ కవితా లక్షణాలైన అక్షర రమ్యత , ప్రసన్న కథన శైలి తో పాటు తన వర్ణనాత్మక శైలిని జోడించి ప్రారంభించాడు. చివరికి చేరే కొద్దీ నాటకీయత, రసపోషణ తో తిక్కన శైలితో, తర్వాత ప్రారంభమయ్యే విరాట పర్వానికి సరిపోయే విధంగా అరణ్య పర్వాన్ని పూర్తి చేశాడు.

ఈ  విధంగా ఎఱ్ఱన మహాభారత రచనలో నన్నయ కథాకథన శైలిని,  తిక్కన నాటకీయ శైలిని ప్రదర్శించి,

కవిత్రయంలో మూడవవానిగా కీర్తి గాంచాడు. తర్వాత కాలంలో వచ్చిన ప్రబంధ రచనకు ఎఱ్ఱన మార్గదర్శకుడయ్యాడు. ఎఱ్ఱన రస పోషణలోనూ, ఉభయవాక్ప్రౌఢిలోనూ దిట్ట అని చెప్పవచ్చు